www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 19 జులై 2025 5
ఏలూరు



పారిశుధ్యం సక్రమంగా లేకపోతే చర్యలు

జెడ్‌పి సిఇఒ ఎం.శ్రీహరి

జీలుగుమిల్లి : గ్రామాల్లో పారిశుధ్యం సక్రమంగా ఉండకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని జిల్లా పరిషత్ పరిపాలన అధికారి ఎం.శ్రీహరి పంచాయతీ సిబ్బందిని హెచ్చరించారు. మండలంలోని పి.రాజవరంలో పారిశుధ్యం అధ్వానంగా ఉందని పలువురు ఐవిఆర్‌ఎస్ కాల్స్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన గ్రామంలో పర్యటించారు. గ్రామంలో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా లేదని 76 శాతం వరకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పర్యటించగా పారిశుధ్యం అధ్వానంగా ఉండటంతో పంచాయతీ కార్యదర్శిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ సిబ్బందితో చెత్తను వేయించారు. అనంతరం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడ కూడా అధ్వానంగా ఉండటంతో అసహనం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యం సక్రమంగా చేయకపోతే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గురుకులం మూత..
విద్యార్థులు రోడ్డున..!

- పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ మూత
- దాదాపు 700 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకం
- తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన
- విద్యాసంవత్సరం ప్రారంభమై నెలదాటినా ఇళ్ల వద్దే విద్యార్థులు
- అధికారుల నుంచి సరైన సమాధానం కరువు..
- ఎంఎల్‌ఎ ధర్మరాజు పట్టించుకోవడం లేదంటూ విమర్శలు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ విద్యార్థుల భవిష్యత్తు గురించి ప్రజా ప్రతినిధులకు, అధికారులకు పట్టడం లేదా.. వాళ్ల పనులే తప్ప విద్యార్థుల చదువుల గురించి ఆలోచించే తీరిక ఏ ఒక్కరికీ లేదా.. అర్థాంతరంగా గురుకుల పాఠశాల మూతపడి వందలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారినా పట్టించుకోరా.. పరిశీలనల పేరుతో కాలక్షేపం చేస్తున్నారా' అంటే అవుననే సమాధానం వస్తోంది. భీమడోలు మండలం పొలసానిపల్లిలోని గురుకుల పాఠశాలకు ఎంతో గొప్ప పేరు ఉంది. ఐదో తరగతి నుంచి ఇంటర్ వరకూ ఈ గురుకులంలో విద్యాబోధన సాగుతోంది. నవోదయ, ఎపిఆర్‌జెసి వంటి పరీక్షలు రాసి ఇక్కడ సీటు పొందేందుకు విద్యార్థులు ఎంతో కష్టపడుతుంటారు. అలాంటి గురుకులాన్ని ప్రస్తుతం పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడనే విమర్శలు వినిపిస్తున్నాయి. పొలసానిపల్లి గురుకుల పాఠశాలలో ప్రస్తుతం 700 మంది వరకూ విద్యార్థులు ఉన్నారు. జూన్ 12వ తేదీన రాష్ట్రంలోని విద్యా సంస్థలు మొత్తం తెరుచుకున్నా ఐదు నుంచి పదో తరగతి విద్యార్థులకు సంబంధించి పొలసానిపల్లి గురుకుల పాఠశాల మాత్రం తెరుచుకోలేదు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల దాటేసినా విద్యార్థులు ఇంకా ఇంటి దగ్గరే ఉన్నారు. వర్షాలకు కొన్ని భవనాలు పడిపోవడంతో ఇబ్బందులు ఏర్పడినట్లు అధికారులు చెబుతున్నారు. భవనాలు కూలిపోయే పరిస్థితి వచ్చే వరకూ కొత్త భవనాల నిర్మాణం గురించి ఎందుకు ఆలోచించలేదో అంతుచిక్కని ప్రశ్నగా ఉంది. ఇంటర్‌కు సంబంధించిన భవనాలు బాగానే ఉండడంతో జులై ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు కౌన్సిలింగ్ నిర్వహించి ఇక్కడ చేర్చుకున్నారు. ఇంతలో ఓ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్న ఘటనతో ఇంటర్ విద్యార్థులు సైతం ఇప్పుడు అక్కడ లేని పరిస్థితి. ఐదు నుంచి ఇంటర్ వరకూ చదివే దాదాపు 700 మంది విద్యార్థులు ఇంటికే పరిమితమైపోయారు. గురుకులంలో ఏర్పడిన ఇబ్బందులను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. గురుకుల పాఠశాల ఇంటర్ విద్యార్థులకు సంబంధించి ఈ ఏడాది చదువుల పరిస్థితిపై ఏ ఒక్కరి నుంచీ సరైన సమాధానం రాని పరిస్థితి. తాత్కాలికంగా ఎక్కడైనా తరగతులు నిర్వహిస్తారా.. లేక వేరే గురుకులంలోకి తరలిస్తారా ఏంటనేది తేల్చని పరిస్థితి నెలకొంది. పొలసానిపల్లి గురుకులంలో



పొలసానిపల్లి గురుకుల పాఠశాల

దాదాపు 20 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఉపాధ్యాయులంతా ప్రస్తుతం ఏంచేయాలేని పరిస్థితి నెలకొంది. భవనాలు దెబ్బతిని నెలలు గడుస్తున్నా అధికారులు ఇప్పటి వరకూ ఏ నిర్ణయమూ తీసుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. అధికారులు రావడం పరిశీలించి వెళ్లడంతోనే కాలం గడిచిపోతోంది. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులకు నెలరోజులుగా పాఠాలు లేకుండా పోయాయి. వచ్చే ఏడాది మార్చిలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలు విద్యార్థులు ఏవిధంగా రాస్తారో ప్రభుత్వం చెప్పాల్సి ఉంది. 700 మంది విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తోందన్న చర్చ సర్వత్రా నడుస్తోంది. ఇటీవల జరిగిన విద్యార్థి ఆత్మహత్య ఘటనతో అక్కడ ఇంటర్ చదువులు నిలిచిపోయాయి. ఆదేమని అడిగితే తల్లిదండ్రులు భయంతో పిల్లలను తీసుకెళ్లిపోయారని చెబుతున్నారు. తల్లిదండ్రులకు సమస్యను వివరించి విద్యార్థులను తిరిగి తీసుకురావాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపైనా లేదా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విద్యార్థుల చదువు పట్ల ప్రభుత్వం, అధికారులు వ్యవహరిస్తున్న తీరు దారుణంగా ఉందన్న చర్చ జనాల్లో నెలకొంది.

ఎప్పటికి తెరుస్తారు.. విద్యార్థుల పరిస్థితి ఏమిటి?

పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీని ఎప్పటికి తెరుస్తారన్న ప్రశ్న అందరినీ వేధిస్తోంది. తమ పిల్లల పరిస్థితి ఏంటో ప్రభుత్వం చెప్పాలని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. అక్కడే క్లాసులు కొనసాగిస్తారా.. లేకపోతే ఎక్కడికైనా మార్పు చేస్తారా ఏ విషయం తేల్చాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

పైఅధికారులు రావడం వెళ్లడం తప్ప ఏ నిర్ణయం చెప్పడం లేదన్న చర్చ సాగుతోంది. రోజులు గడిచిపోతుండటంతో విద్యార్థుల భవిష్యత్తుపై సర్వత్రా ఆందోళన నెలకొంది.

ఎంఎల్‌ఎ పట్టించుకోరా..

తన నియోజకవర్గంలో గురుకులం మూతపడి 700 మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారితే స్థానిక ఎంఎల్‌ఎ పత్సమట్ల ధర్మరాజు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటివరకూ ఆయన ఈ స్కూల్‌కు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారో మాట్లాడలేదని అందరిలోనూ చర్చనీయాంశంగా మారింది. నియోజకవర్గంలో ఇంత పెద్ద సమస్య నెలకొంటే సిఎం, విద్యాశాఖ మంత్రి లోకేష్ దృష్టికి తీసుకెళ్లి సమస్యను ఎంఎల్‌ఎ పరిష్కరించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇటీవల ఇన్‌ఛార్జి మంత్రి మీటింగ్ జరిగింది. ఇన్‌ఛార్జి మంత్రి దృష్టికైనా సమస్యను తీసుకెళ్లారా అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ముందుకు

బి.ఉమాకుమారి, గురుకుల విద్య జిల్లా కోఆర్డినేటర్

ప్రస్తుతం పొలసానిపల్లి గురుకుల పాఠశాల, జూనియర్ కాలేజీ పనిచేయడం లేదు. భవనాల సమస్య రావడంతో ఉన్నతాధికారులు పరిశీలిస్తున్నారు. పిల్లలను పిలవమని ఉన్నతాధికారులు ఆదేశించిన తర్వాత పిలుస్తాం. ప్రత్యామ్నాయంగా ద్వారకాతిరుమలలో కొన్ని తరగతులు, కొంత మంది విద్యార్థులకు వేరేచోట విద్యాబోధన చేయాలా అన్నదానిపై ఆలోచనలు జరుగుతున్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ముందుకు సాగుతాం.

భూసేకరణ వేగవంతం చేయాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో జాతీయ రహదారులకు, ఇండస్ట్రియల్ పార్కులకు భూసేకరణ చేసి, నిర్మాణాలు వేగవంతం చేసి ప్రజలకు వాడుకలోకి తేవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టరేట్‌లోని గౌతమీ సమావేశ మందిరంలో శుక్రవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జిల్లా జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి సంయుక్తంగా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ జిల్లాలో జాతీయ రహదారులకు భూసేకరణ వేగవంతం చేసి నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. కాలయాపన చేస్తే అభివృద్ధి పనులు కుంటుపడతాయని, అటువంటి అధికారులను గుర్తించి బాధ్యులను చేస్తామని తెలిపారు. కైకలూరు బైపాస్ 8 కిలోమీటర్లు పనులకు నాలుగు కిలోమీటర్లు పూర్తయ్యాయని, మిగిలిన పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులు మొదలు పెట్టాలన్నారు. కోర్టు కేసుల పెండింగ్‌పై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారం అయ్యేలా చూడాలన్నారు. తాడిపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు సంబంధించి రైతులకు నష్టపరిహారం త్వరితగతిన అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టరు ఆర్‌డిఒను ఆదేశించారు. మిగిలిన రైతులను సమన్వయం చేసి భూమి సేకరించి సకాలంలో నష్టపరిహారం అందించి, రోడ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు.


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రి సెల్వి


ఎంఎస్‌ఎంఇ పార్కులకు ఈ నెలాఖరుకు భూ సేకరణ పూర్తి చేయాలి

ప్రతి కుటుంబం నుంచీ ఒక పారిశ్రామికవేత్తను రూపొందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 'వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెన్యూర్' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని కలెక్టర్ తెలిపారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కుల ఏర్పాటుకు నిర్మాణాలకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. అందుకు అనుగుణంగా ఈ నెలాఖరు నాటికి ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటుకు అవసరమైన భూసేకరణ పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. పోలవరం నియోజకవర్గంలో తాడువాయి గ్రామంలో 30 ఎకరాలు భూమికి ప్రతిపాదనలు వెంటనే పంపించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రయివేటు భూమిని సేకరించాలన్నారు. ఇండస్ట్రియల్ పార్కులు వస్తే పరిశ్రమలు వచ్చి స్థానిక యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు వస్తాయని తెలియజేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరరావు, నూజివీడు సబ్ కలెక్టర్ బచ్చు స్వరణ్‌రాజ్, జంగారెడ్డిగూడెం ఆర్‌డిఒ ఎంవి.రమణ, జాతీయ రహదారుల అధికారులు పాల్గొన్నారు.

మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల
సమస్యను పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న దాదాపు 2000లకు పైగా మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులను వెంటనే పరిష్కరించాలని పిడిఎఫ్ ఎంఎల్‌సి బొర్రా గోపీమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం యుటిఎఫ్ నాయకులతో కలిసి ఆయన ఏలూరు సర్వజన ఆస్పత్రిలో మెడికల్ సూపరింటెండెంట్ శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ గత జనవరి నుంచి అన్ని మెడికల్ రీయంబర్స్‌మెంట్ బిల్లులూ అప్రూవ్ కాకుండా అలాగే ఉన్నాయని, విద్యాశాఖకు సంబంధించిన దాదాపు 700 బిల్లులు పరిష్కారానికి నోచుకోకుండా పడి ఉన్నాయని, వెంటనే సమస్యను పరిష్కరించాలని కోరారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ రుద్రాక్షి మాట్లాడుతూ త్వరితగతిన సమస్యను పరిష్కరించకపోతే యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పిఎఫ్ లోన్లు, ఫైనల్ పేమెంట్లు త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ ఎంఎల్‌సి గోపీమూర్తితో కలిసి యుటిఎఫ్ ఏలూరు జిల్లా నాయకత్వం జెడ్‌పి సిఇఒతో చర్చించి సమస్యను పరిష్కరించాలని కోరారు. పిఎఫ్ లోన్లు అప్లికేషన్ పెట్టిన తర్వాత 20 రోజుల్లోపు సిఎఫ్ఎంఎస్ లోకి వెళ్లేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా కార్యదర్శులు కె.కమల్‌కుమార్, నంబూరు రాంబాబు పాల్గొన్నారు.


సూపరింటెండెంట్ శశిధర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంఎల్‌సి గోపీమూర్తి, నేతలు

తగ్గిన గోదావరి నీటిమట్టం

ప్రజాశక్తి - పోలవరం

పోలవరంలో గోదావరి నీటిమట్టం శుక్రవారం సాయంత్రానికి పూర్తిగా తగ్గింది. అయితే ప్రాజెక్టు స్పిల్‌వే నుండి 1,03,027 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 27.120 మీటర్లు, స్పిల్‌వే దిగువన 17.150 మీటర్లు, ఎగువ కాపర్ డ్యాం ఎగువన 27.190 మీటర్లు, దిగువ కాపర్ డ్యాం దిగువన 16.200 మీటర్లు, ఎగువ దిగువ కాపర్ డ్యాంల మధ్య 15.720 మీటర్ల నీటిమట్టం నమోదైనట్లు జల వనరుల శాఖ అధికారులు తెలిపారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి

ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి - ఏలూరు కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం డిఎస్‌సి 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎంఎల్‌సి బి.గోపీమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ఏలూరు జిల్లా కలెక్టరేట్ వద్ద డిఎస్‌సి 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో వందల మంది ఉపాధ్యాయులు తమకు పాత పెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ భారీ ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎంఎల్‌సి గోపీమూర్తి మాట్లాడుతూ తమది డబల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పుకునే రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన ఆదేశాలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. 2003లో నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ అంతా పూర్తయినప్పటికీ అప్పటి ప్రభుత్వం కావాలనే నియామక ఉత్తర్వులు ఆలస్యంగా ఇచ్చిందని, 2004 సెప్టెంబర్ ఒకటి నుంచి కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానం అమల్లోకి తెచ్చిందని తెలిపారు. సిపిఎస్ విధానం అమల్లోకి వచ్చిన తర్వాత తమకు నియామక ఉత్తర్వులు ఇచ్చారు కాబట్టి తమకు పాత పెన్షన్ విధానం వర్తించదని రాష్ట్ర ప్రభుత్వం కావాలనే మోసం చేస్తోందని అన్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా మెమో 57 ఇచ్చి వీరందరికీ పాత పెన్షన్ విధానం అమలు చేయాలని చెప్పిందని, దేశంలో 16 రాష్ట్రాల్లో ఈ విధానం అమలు చేశారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సంస్థలైన రైల్వే, తపాలా శాఖ వంటి వాటిల్లోనూ తమ ఉద్యోగులకు ఈ మెమోను అమలు చేసి న్యాయం చేశాయని, అయితే ఆంధ్రప్రదేశ్‌లో ఎందుకు జాప్యం జరుగుతోందని ప్రశ్నించారు. ఇదే మెమో 57 ఆధారంగా రాష్ట్రంలో ముగ్గురు ఉన్నత ఐఎఎస్ అధికారులకు పాత పెన్షన్ వర్తింపజేస్తూ జిఒ ఇచ్చారని, అధికారులకు ఒక న్యాయం ఉపాధ్యాయులకు ఒక న్యాయమా, ఇది వివక్ష కాదా అని ప్రశ్నించారు. ఆగస్టులో జరగనున్న శాసనమండలి సమావేశాల్లో ఈ విషయంపై తన గొంతు వినిపిస్తానని, ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానాన్ని వర్తింపజేయకపోతే ఉపాధ్యాయుల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఫ్యాప్టో రాష్ట్ర ఛైర్మన్ ఎల్.సాయి శ్రీనివాస్, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెఎసి ఛైర్మన్ చోడగిరి శ్రీనివాస్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు ఆర్.రవికుమార్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి ప్రసాద్ కార్యక్రమానికి మద్దతుగా ప్రసంగించారు. ఫోరం రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, జిల్లా కన్వీనర్లు జగదీష్, వెంకట్రావు, సూర్య ప్రకాష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న ఎంఎల్‌సి గోపీమూర్తి

సమస్యలు పరిష్కరించండి


కొనసాగిన మున్సిపల్ కార్మికుల సమ్మె

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నూజివీడు పురపాలక సంఘ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యంలో ఐదో రోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు మాట్లాడుతూ మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు గత ఏడేళ్ల నుంచి జీతాలు పెంచకపోవడం చాలా దారుణమన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వారు వేతనాలు పెంచాలని, రాష్ట్ర ప్రభుత్వం జిఒ 36 ప్రకారం ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచాలని కోరారు. మున్సిపాలిటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, రిటైర్‌మెంట్ బెనిఫిట్లు కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ అధ్యక్షులు ఎన్ఆర్.హనుమాన్లు, మున్సిపల్ యూనియన్ నాయకులు రంగారావు, అప్పారావు, రామారావు, తదితరులు పాల్గొన్నారు.


నూజివీడులో...

చింతలపూడి : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రెండు రోజుల నుంచి నల్ల రిబ్బన్లు ధరించి నిరసన తెలియజేస్తున్నామని చింతలపూడి వాటర్ వర్క్ సిబ్బంది తెలిపారు. సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, జిఒ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరి ంచకుంటే వారికి మద్దతుగా తాము కూడా సమ్మెలోకి వెళ్తామని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) చింతలపూడి యూనిట్ అధ్యక్ష కార్యదర్శులు జి.నాగరాజు, టి.విజయరాజు చెప్పారు. సమ్మెలోకి వెళ్తే ప్రజల అసౌకర్యానికి ప్రభుత్వానిదే బాధ్యత అవుతుందని యూనియన్ నాయకులు ఎస్‌డి సలీం, ఎం.సత్యం, కె.నాగరాజు, మనోహర్ చెప్పారు.



చింతలపూడిలో...

కృష్ణా డెల్టా శివారు భూములకు సాగునీరందించాలి

బీటలు వారిన పొలాలను పరిశీలించిన రైతు సంఘం నేతలు

ప్రజాశక్తి - ఏలూరు రూరల్

కృష్ణా డెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మండలంలోని మాదేపల్లి, కాట్లంపూడి, లింగారావుగూడెం గ్రామాల్లో రైతు సంఘం నాయకులు శుక్రవారం పర్యటించి ఎండిపోతున్న నారుమళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కె.శ్రీనివాస్ మాట్లాడుతూ కృష్ణా డెల్టా పరిధిలో వేలాది ఎకరాలకు సాగునీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వరి నారు మళ్లు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని చెప్పారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం ద్వారా వస్తున్న సాగునీటిని కెఇ కెనాల్‌లోకి మళ్లించి కృష్ణాడెల్టా శివారు ప్రాంత భూములకు సాగునీరు అందించి పంటలు కాపాడాలని డిమాండ్ చేశారు. మరోవైపు పంట కాలువలు తూడు, గుర్రపు డెక్క, నాచు, చెత్తాచెదారం, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయాయని చెప్పారు. వేసవికాలంలో తగిన విధంగా కాలువల బాగు చేసే పనులు చేపట్టలేదని చెప్పారు. ప్రస్తుతం హడావుడిగా గుర్రపు డెక్కను తొలగించకుండా కలుపు మందు చల్లారని, ఈ నీటినే ఏలూరు రూరల్ మండలంలోని ప్రజలు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తారని, అత్యంత ప్రమాదకర కలుపు మందులు చల్లడం దారుణమన్నారు. గుర్రపు డెక్కను చంపేందుకు కలుపు మందు చల్లి ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. సాగునీరు పారుదలకు ఆటంకాలు లేకుండా పంట కాలువలు బాగు చేసే పనులు వెంటనే చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో అన్నంరెడ్డి రంగారావు, సుంకర నరసింహారావు, వి.రామారావు, పి.భాస్కరరావు, టి.రంగారావు, బైరెడ్డి కృష్ణారావు, పలువురు రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రైతు సంఘం నేతలు

సిఎస్‌సి నిర్మాణాలు వేగవంతం చేయాలి

నాణ్యతా ప్రమాణాలు పాటించి విద్యార్థులకు, పర్యాటకులకు వాడుకలోకి తేవాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌ల నిర్మాణాలు వేగవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ గౌతమి సమావేశ మందిరంలో జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిర్మాణాల ప్రగతిపై సంబంధిత అధికారులతో కలెక్టర్ కె.వెట్రిసెల్వి శుక్రవారం మండలాల వారీగా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పర్యాటక కేంద్రాలు, ప్రభుత్వ వసతి గృహాల్లో 258 కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు మంజూరయ్యాయని, నిర్మాణాలు వేగవంతం చేసి విద్యార్థులకు, పర్యాటకులకు వాడుకలోకి తీసుకురావాలన్నారు. ఇంకా మొదలుపెట్టని చోట టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పనులను వెనువెంటనే మొదలు పెట్టాలన్నారు. ఒక్కో కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌కు రూ.మూడు లక్షల నిధులు మంజూరయ్యాయని, పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని చెప్పారు. పనుల నాణ్యత విషయంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే అటువంటి అధికారులను గుర్తించి బాధ్యులను చేస్తామని చెప్పారు. గత కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు క్షేత్రస్థాయిలో పరిశీలించి తలుపులు, విద్యుత్, వాటర్ కనెక్షన్లలో చిన్న చిన్న రిపేర్లు ఉంటే పూర్తి చేయాలన్నారు. అంగన్వాడీ సెంటర్‌లో చిన్నారులను దృష్టిలో పెట్టుకుని టాయిలెట్స్ విషయంలో మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ జి.త్రినాథబాబు, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ డిడి విశ్వమోహన్‌రెడ్డి, జిల్లా వెనుకబడిన తరగతులు సంక్షేమ శాఖ అధికారి ఆర్‌వి.నాగరాణి, సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఇన్‌స్టిట్యూషన్ జిల్లా కో-ఆర్డినేటర్ ఉమాదేవి, జిల్లా టూరిజం మేనేజర్ ఎస్.పట్టాభిరామన్న, ఇంజినీరింగ్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాల ప్రగతి సాధించాలి

పనితీరు కనబరిచిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లను సత్కరిస్తాం : కలెక్టర్

ఏలూరు : జిల్లాలో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేసి మంచి ప్రగతి చూపాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హౌసింగ్ అధికారులను ఆదేశించారు. స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి గృహ నిర్మాణ శాఖ ఇంజినీర్లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో గృహనిర్మాణ ప్రగతి తీరును జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా శుక్రవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణాల లక్ష్యాలను సాధించేందుకు రానున్న 12 రోజులు ఎంతో కీలకమన్నారు. రూఫ్ లెవల్, రూఫ్ కాస్ట్ స్థాయికి చేరుకున్న ఇళ్ల నిర్మాణాలను వెంటనే పూర్తి చేసేందుకు సంబంధిత లబ్ధిదారులను అవగాహన పరచాలన్నారు. ఇప్పటికే పనులు పూర్తయిన ఇళ్లకు సంబంధించి ప్రభుత్వం సొమ్ము జమ చేసి ఉందని, తదుపరి పనులు పూర్తిచేస్తే వెంటనే చెల్లింపులు జరుగుతాయని చెప్పారు. ఇళ్ల నిర్మాణాల్లో నాణ్యత తప్పనిసరిగా పాటించి మంచి ప్రగతి చూపాలన్నారు. ఈ వి షయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వచ్చేవారం నాటికి మంచి ప్రణాళికతో ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి కనబరిచేలా కృషి చేయాలన్నారు. ఈ విషయంలో మంచి ప్రగతి చూపిన ఇంజినీరింగ్ అసిస్టెంట్లను గుర్తించి సత్కరించనున్నట్లు తెలిపారు. ఏలూరు, ఉంగుటూరు, మండవల్లి, కైకలూరు తదితర మండలాల్లో ఇళ్లనిర్మాణాల ప్రగతి వేగవంతం చేయాలన్నారు. వర్షాకాలం సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని ఇళ్ల నిర్మాణాలకు అవసరమైన ఇసుక నిల్వలను సిద్ధం చేసుకోవాలన్నారు. ఇదే సమయంలో నిల్వచేసిన ఇసుక, ఇతర నిర్మాణ సామగ్రి అవకతవకలకు గురికాకుండా తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ విషయంలో ఎటువంటి ఫిర్యాదులు అందినా సంబంధిత సిబ్బందిపై తక్షణ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా హౌసింగ్ అధికారి జివివి.సత్యనారాయణ, గృహ నిర్మాణ శాఖ ఇఇలు, డిఇలు, ఎఇలు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

చెలరేగిపోతున్న మద్యం మాఫియా

అవినీతిలో కూటమి ప్రభుత్వం

సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు వనజ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఇసుక, మద్యం మాఫియాలు చెలరేగిపోతున్నాయని, కూటమి ప్రభుత్వం అవినీతిలో కూరుకుపోయిందని సిపిఐ జాతీయ కార్యదర్శివర్గ సభ్యురాలు, పార్టీ జిల్లా ఇన్‌ఛార్జి అక్కినేని వనజ విమర్శించారు. స్థానిక సిపిఐ జిల్లా కార్యాలయంలో శు క్రవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. సిఎం చంద్రబాబు నిత్యం స్వర్ణాంధ్రప్రదేశ్‌గా రాష్ట్రాన్ని మారుస్తానని చెబుతూ మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారని ఎద్దేవా చేశారు. ఇసుక ఉచితంగా అందిస్తామని ఆర్భాటపు ప్రకటనలు చేశారని, పేదవాని ఇంటి నిర్మాణానికి ఇసుక మాత్రం అందుబాటులో లేదని విమర్శించారు. ఇసుకను మాఫియాకు అప్పజెప్పి రూ.కోట్లు దండుకుంటున్నారని ఆరోపించారు. లోకేష్ తన యువగళం పాదయాత్ర సందర్భంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తే పగలగొట్టమని పిలుపునిచ్చారని, నేడు సెకి ఒప్పందాలు చేసుకుని స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని చెప్పారు. ఆగస్టు 5వ తేదీన విద్యుత్ కార్యాలయాలను ముట్టడిస్తామని తెలిపారు. చండీగఢ్‌లో జరిగే సిపిఐ జాతీయ మహాసభలో మోడీ ప్రభుత్వ వినాశకర విధానాలపై చర్చించి, కార్యాచరణ రూపొందిస్తామని, ఒంగోలులో ఆగస్టు 23, 24, 25 తేదీల్లో సిపిఐ రాష్ట్ర మహాసభ జరుగుతుందని తెలిపారు. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డేగా ప్రభాకర్, జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బండి వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.


కోతకు గురై ప్రమాదకరంగా ఉన్న కల్వర్టు

ప్రమాదకరంగా కల్వర్టు

భయాందోళనలో వాహనదారులు


ప్రజాశక్తి - కుక్కునూరు

మండలంలోని అరవపల్లి-నెమలిపేట గ్రామ ప్రధాన రహదారిలోని కల్వర్టు కోతకు గురై అత్యంత ప్రమాదకర స్థితిలో ఉంది. దీంతో వాహనదారులు, ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఈ రహదారిపై రోజూ వందలాది మంది ప్రయాణిస్తుండగా రాత్రి వేళల్లో కల్వర్టు స్థితి మరింత భీతి కలిగిస్తోంది. గతంలో ఇక్కడ జరిగిన పలు ప్రమాదాలు స్థానికులను కలవరపెడుతున్నప్పటికీ అధికారులు కనీస సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అప్రమత్తత లేని ప్రయాణం ప్రమాదానికి దారితీస్తుందని స్థానిక గిరిజన రైతులు, వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణం స్పందించి, కల్వర్టు పునఃనిర్మాణం చేపట్టి, ప్రమాద నివారణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వైవాక సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా వెంకటప్పయ్య

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండలంలోని వైవాక ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా వీరంకి వెంకటప్పయ్య శుక్రవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వెంకటప్పయ్యకు టిడిపి నాయకులు, గ్రామ ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు. సభ్యులు అందుబాటులో లేకపోవడంతో ప్రమాణ స్వీకారం చేయలేదు. ఈ కార్యక్రమంలో సొసైటీ కార్యదర్శి దొడ్డాకుల రామాంజనేయులు, బ్యాంకు ఖాతాదారులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


ప్రమాణస్వీకారం చేసిన వెంకటప్పయ్య

ఫ్లోరోసిస్ నివారణపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

ఫ్లోరోసిస్ వ్యాధి నివారణ కోసం ప్రతిఒక్కరూ తాగునీటి విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యాధికారిణి షకీలా ఇవాంజిలిన్ అన్నారు. మండలంలోని కాట్రేనిపాడు ఎంపిపి హైస్కూల్‌లో విద్యార్థులకు ఫ్లోరోసిస్ నివారణపై శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గద్దల సుహాసిని మోహనరావు మాట్లాడుతూ కమ్యూనిటీ సర్వేలో భాగంగా ఇంటింటికీ అవగాహన సదస్సు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, డిసి ఛైర్మన్ రావిప్ర బాలకృష్ణ, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌పిఎల్ ఎన్నికలు

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పరింపూడి జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఎస్‌పిఎల్ ఎన్నికలు హెచ్‌ఎం ఉమాదేవి ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు లక్ష్మి, వసంతకుమార్‌ల సమన్వయంతో పాఠశాల సిబ్బంది ఆధ్వర్యంలో విద్యార్థినులు ఈ ఎన్నికల్లో అత్యంత ఉత్సాహంతో, ఆసక్తితో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

వైసిపి చింతలవల్లి అధ్యక్షునిగా సూర్య

ప్రజాశక్తి - ముసునూరు

వైసిపి చింతలవల్లి గ్రామ అధ్యక్షునిగా పల్లిపాము సూర్య ఎన్నికైనట్లు ఆ పార్టీ మండలాధ్యక్షులు మూల్పూరి నాగవల్లేశ్వరరావు తెలిపారు. మండలంలోని చింతలవల్లిలో ఎంపిపి కొండా దుర్గాభవాని, వైస్ ఎంపిపి కోటగిరి రాజా నాయన, జెడ్‌పిటిసి సభ్యులు వి.ప్రతాప్ ఆధ్వర్యంలో గ్రామ అధ్యక్షునిగా పల్లిపాము సూర్యను నియమించినట్లు వారు తెలిపారు.

నూజివీడు ఎఎంసి ఛైర్‌పర్సన్‌గా అరుణ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

నూజివీడు వ్యవసాయ మార్కెట్ యార్డ్ ఛైర్‌పర్సన్‌గా గొల్లపల్లి గ్రామానికి చెందిన కుంపటి అరుణ ఎంపికైంది. ఆమె భర్త కుంపటి రంగారావు నూజివీడు పట్టణంలోని శారద జూనియర్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. ఈ సందర్భంగా నూజివీడులోని జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు అభినందించారు.


అరుణ

నేరాలు - ఘోరాలు

బాలికపై అత్యాచారం : కేసు నమోదు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాలికపై వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడని నూజివీడు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మీర్జాపురానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ఎజ్జల నాగమల్లేశ్వరరావు అత్యాచారానికి పాల్పడినట్లు బాలిక కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోక్సో చట్టం కింద రూరల్ ఎస్ఐ జ్యోతి బసు కేసు నమోదు చేశారు. బాలికను మెడికల్ టెస్టుల నిమిత్తం విజయవాడకు తరలించారు. నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్.ప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు.

కాలిన గాయాలతో మహిళ మృతి

ప్రజాశక్తి - మండవల్లి

ఆలయానికి వెళ్లిన మహిళ దీపకు ప్రమాదవశాత్తూ నిప్పుంటుకుని గాయాలపాలైన మహిళ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండవల్లికి చెందిన గుడివాడ తయారమ్మ ప్రతి గురువారం క్రమం తప్పకుండా స్థానిక సాయిబాబా ఆలయానికి వెళ్లి పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో ఈ నెల 10వ తేదీన సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణమి సందర్భంగా నిర్వహిస్తున్న పూజా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్లింది. ఈ క్రమంలో ఆమె దీపకు ప్రమాదవశాత్తూ నిప్పు అంటుకుంది. ఇది గమనించిన గుడిలో ఉన్నవారు మంటలను ఆర్పివేసి వెంటనే ఆమెను ఏలూరులోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అప్పటినుంచి అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి ఈ నెల 17వ తేదీ గురువారం మృతి చెందింది. మృతురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్లు పోలీసులు తెలిపారు.

కుమార్తె కన్పించడం లేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కుమార్తె కన్పించడం లేదని తండ్రి చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని రెడ్డిగణపవరం గ్రామానికి చెందిన ఓ యువతి గురువారం తన కుటుంబ సభ్యులకు పని నిమిత్తం బయటకు వెళ్లి పని ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చేస్తానని చెప్పి ఇంట్లో కనిపించలేదు. దీంతో కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ కె.నాగేశ్వరరావు తెలిపారు.

ఆటో నడుపుతూ.. ఆదర్శంగా నిలుస్తూ

ఆత్మవిశ్వాసంతో ముందుకెళ్తున్న మార్తమ్మ

ప్రజాశక్తి - చింతలపూడి

ఏడడుగులు నడిచి కడదాకా తోడు ఉంటాడనుకున్న భర్త మృతి చెందితే ఆమె కుంగిపోలేదు. ఆ కష్టాన్ని దిగమింగుకుంది. ఆటో ద్వారా బతుకు తెరువు వెతుక్కుంది. కష్టాల్లో కన్నీళ్లు వచ్చినా వెనకడుగు వేయలేదు. తన కుమార్తెకు వివాహం చేసింది. ఎవరకీ భయపడకుండా తనలాగా ధైర్యంగా బతకాలని తోటి మహిళలందరికీ లింగపాలెం మండలం వేములపల్లికి చెందిన ఆటో డ్రైవర్‌గా పనిచేస్తున్న అంకునూరి మార్తమ్మ ఆదర్శంగా నిలుస్తుంది.


ఆటో నడుపుతున్న మార్తమ్మ

వేములపల్లి గ్రామానికి చెందిన అంకునూరి మార్తమ్మ భర్త 2017లో అనారోగ్య కారణాలతో మరణించారు. ఆమెకు ఒక కుమార్తె ఉంది. మార్తమ్మ కూలి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషించింది. 2023 వరకు కూలి పనులకు వెళ్లింది. అనంతరం గ్రామంలో సరిగ్గా కూలి పనులు దొరకక ఇబ్బందులు ఎదుర్కొంది. డ్వాక్రా గ్రూపు ద్వారా రూ.మూడు లక్షల రుణం తీసుకుని ఆటో తీసుకుని డ్రైవింగ్ నేర్చుకుని, లైసెన్సు తీసుకుంది. ఆ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తుంది. రూపాయి రూపాయి జాగ్రత్త చేసి ఆటోకు ప్రతి నెలా ఇఎంఐ కడుతుంది. డ్వాక్రా రుణం సొమ్ము కొంత, మరికొంత సొమ్ము అప్పు చేసి గతేడాది ఆమె కుమార్తెకు వివాహం చేసింది. ఆటో డ్రైవర్‌గా పనిచేయటం తనకు చాలా గర్వంగా ఉందని, తాను చేస్తున్న పని పట్ల నిబద్ధతే తనలో ఆత్మ విశ్వాసాన్ని, ధైర్యాన్ని నింపిందని మార్తమ్మ చెబుతుంది.

హోల్‌సేల్ వ్యాపారులు దాడులు ఆపాలి

కలెక్టరేట్ వద్ద మొబైల్ షాపు యజమానుల ధర్నా

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

మొబైల్ వ్యాపారులపై హోల్‌సేల్ వ్యాపారులు చేస్తున్న దాడులు ఆపాలని ఏలూరు మొబైల్ షాపు ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వారు కలెక్టరేట్ కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 25 ఏళ్లుగా పట్టణంలో మొబైల్ రిపేరు, సేల్స్ షాపులు నడుపుకుంటున్నామని, గత రెండు, మూడేళ్లుగా ఎప్పుడూ లేనివిధంగా హోల్‌సేల్ చేసే వ్యాపారులు స్థానికంగా ఉన్న రౌడీషీటర్లతో తమను బెదిరిస్తున్నారని, దాడులు చేస్తున్నారని వాపోయారు. అంతేకాకుండా స్పేర్ పార్ట్స్ ధరలు పెంచి అదే ధరలకు వారి దగ్గర కొనుగోలు చేయాలని అల్టిమేట్ జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమపై చేస్తున్న దాడులకు రోజుకు రూ.వంద కూడా ఇంటికి తీసుకెళ్లలేని పరిస్థితి నెలకొందని చెప్పారు. వారి దౌర్జన్యాలకు భయపడి సాటి టెక్నీషియన్ ఫణి కుమార్ ఆత్మహత్య చేసుకున్నాడని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ది ఏలూరు మొబైల్ షాప్ ఓనర్స్, వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మదన్ కుమార్, సభ్యులు నాగేంద్రబాబు, సైమన్, మొబైల్ షాపు సిబ్బంది పాల్గొన్నారు.



ఏలూరు సిటీ : ధర్నా చేస్తున్న మొబైల్ వ్యాపారులు

మొబైల్ షాపుల యజమానులు దాడులు ఆపాలి

కలెక్టరేట్ వద్ద మొబైల్ స్పేర్ పార్ట్స్ షాపు యజమానుల ధర్నా

ఏలూరు అర్బన్ : స్థానిక మొబైల్ షాపుల యజమానులు తమపై భౌతికంగా దాడులు చేస్తూ, అనేక ఆంక్షలు విధిస్తూ తమను వ్యాపారాలు చేసుకునివ్వకుండా భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, వారి నుంచి తమకు రక్షణ కల్పించాలని కోరుతూ మొబైల్ స్పేర్ పార్ట్స్ షాపు యజమానులు కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యజమానులు కైలాష్, సర్వన్ మాట్లాడుతూ తామంతా ఇక్కడే పుట్టి ఇక్కడే పెరిగామని, పూర్వీకులు రాజస్థాన్ ప్రాంతం నుంచి 50 ఏళ్లమే క్రితమే వచ్చి ఏలూరులో వ్యాపారాలు చేసుకుంటూ స్థిరపడ్డారని, తాము ఇప్పుడు మొబైల్ అమ్మకాలు, స్పేర్ పార్ట్స్, రిపేర్ షాపులు నిర్వహించుకుంటూ ఉండగా స్థానిక మొబైల్ షాపుల యజ మానులు కొంతమంది తమపై దౌర్జన్యం చేస్తూ, తమ షాపుల సిబ్బందిపై దాడులు చేస్తూ, తాము రిపేర్లు చేయకూడదని, వారికి డబ్బులు చెల్లించాలని, ఇంకా అనేక ఆంక్షలు పెడుతూ తమను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని తెలిపారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి, సిబ్బందికి జీతాలు ఇస్తూ, షాపు, ఇంటి అద్దెలు కడుతూ, ప్రభుత్వానికి పన్నులు చెల్లిస్తు న్న తాము ప్రస్తుతం వ్యాపారాలు చేయలేని పరిస్థితి నెలకొందని, అధికారులు ఈ విష యంలో విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌కు, ఎస్‌పికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. ప్రవీణ్, రమేష్, కిరణ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.



ఏలూరు అర్బన్ : ధర్నాలో మార్వాడి మొబైల్ షాపు యజమానులు

ప్రజా శ్రేయస్సే ప్రధాన లక్ష్యం

ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర ప్రజల శ్రేయస్సే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుస్థిరపాలనకు నాంది పలికిందని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం స్థానిక 39వ డివిజన్‌లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత స్వేచ్ఛాయుత వాతావరణం కల్పిస్తూ, సుపరిపాలనను కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ముఖ్యంగా గడిచిన ఏడాదికాలంలో ప్రజాశ్రేయస్సే ధ్యేయంగా అనేక సంక్షేమ పథకాల లబ్ధిని అర్హులకు కల్పించిన ఘనతను ప్రభుత్వం సొంతం చేసుకుందన్నారు. ప్రజలంతా ప్రభుత్వ పాలనపై పూర్తిస్థాయిలో అవగాహనను పెంపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, ఏలూరు ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, డిప్యూటీ మేయర్ పప్పు ఉమామహేశ్వరరావు, టిడిపి ఏలూరు నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, కో - ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, మాజీ కౌన్సిలర్ బెల్లపుకొండ కిషోర్, పలివెల లవకిషోర్, పార్టీ డివిజన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెదవేగి మండలంలో...

దెందులూరు : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పెదవేగి మండలంలోని కొండలరావుపాలెం, రాట్నాలకుంట, రాయన్నపాలెం గ్రామాల్లో దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ శుక్రవారం పర్యటించారు. గ్రామాల్లో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి సంక్షేమ పాలనను ప్రజలకు వివరిస్తూ కరపత్రాలు అందించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకుని సత్వరమే వాటిని పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

నేడు తారకరామనగరంలో...

కొయ్యలగూడెం : పట్టణంలోని బూత్ నెంబర్ 218 తారకరామనగరంలో ఈ నెల 19వ తేదీ శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, ఎపి ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్ పాల్గొంటారని టిడిపి కొయ్యలగూడెం మండలాధ్యక్షులు పారేపల్లి నరేష్ తెలిపారు. నియోజకవర్గంలోని నాయకులు, ఏడు మండలాల అధ్యక్షులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, పార్టీ గ్రామ అధ్యక్షులు, అనుబంధ కమిటీ అధ్యక్షులు, సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఆర్‌జియుకెటి విద్యార్థినులకు అవగాహన

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

2025 -26 విద్యా సంవత్సరంలో ఆర్‌జియుకెటి మొదటి సంవత్సరంలో చేరిన విద్యార్థినులకు మూడో రోజు అవగాహన కార్యక్రమం కొనసాగింది. ఉదయం నూజివీడు క్యాంపస్ విద్యార్థినులకు, భోజనానంతరం ఒంగోలు, శ్రీకాకుళం క్యాంపస్ విద్యార్థినులకు ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ ఫర్ గర్ల్స్ డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ డాక్టర్ గౌతమి, ఇతర అధికారులు ఈ కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నూజివీడు డిఎస్‌పి కెవివిఎన్.వరప్రసాద్‌రావు ఆదేశాల మేరకు నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్ ఔట్ పోస్ట్ ఇన్‌ఛార్జి కె.రాంబాబు విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడారు. ర్యాగింగ్, మత్తు పదార్థాలు తీసుకుంటే వచ్చే అనర్థాల గురించి, ప్రస్తుతం సమాజంలో జరుగుతున్న సైబర్ నేరాల గురించి నూతన విద్యార్థులకు తెలియజేసి వారికి అవగాహన కల్పించారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయంగా ఆలోచించి, చట్టాన్ని గౌరవిస్తూ, నైతిక విలువలతో ఎదగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఔట్ పోస్ట్ ఎస్ఐ రాంబాబుతో పాటు సతీష్, ప్రకాష్, క్యాంపస్‌లోని పోస్ట్ ఆఫీస్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.


అవగాహనా కార్యక్రమంలో విద్యార్థినులు

సిఎం సహాయ నిధి పేదలకు వరం


చింతలపూడి ఎంఎల్ఎ రోషన్‌కుమార్

ప్రజాశక్తి - చింతలపూడి

సిఎం సహాయ నిధి పేదలకు వరమని చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. నియోజకవర్గంలోని 54 మంది లబ్ధిదారులకు సిఎంఆర్‌ఎఫ్ కింద సుమారు రూ.45 లక్షల విలువైన చెక్కులను ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయంలో శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆసుపత్రిలో చికిత్స పొంది ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద కుటుంబాలను సిఎం సహాయ నిధి ద్వారా చంద్రబాబు ఆదుకుంటున్నారన్నారు. ఏడాది కాలంలో నియోజకవర్గంలో సుమారు రూ.మూడు కోట్ల వరకు సిఎం సహాయ నిధి అందించినట్లు తెలిపారు.


సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందిస్తున్న ఎంఎల్ఎ

విద్యాసంస్థల్లో సైబర్ నేరాలపై అవగాహన


మాట్లాడుతున్న సిఐ సత్యశ్రీనివాస్

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో విద్యార్థులకు సైబర్ నేలలపై నూజివీడు సిఐ సత్య శ్రీనివాస్ శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ సైబర్ నేరాల పరిధి రోజురోజుకు విస్తరిస్తుందన్నారు. ముఖ్యంగా యువత సోషల్ మీడియా వేదికల ద్వారా మోసపోవడం, ఫేక్ లింకులు, ఒటిపి స్కాం, డేటా దొంగతనాలు, నకిలీ ఖాతాలు వంటి సమస్యలు పెరుగుతున్నాయని విద్యార్థులకు వివరించారు. ఈ విషయంపై విద్యార్థులు పూర్తిగా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారం ఎవరితోనూ పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయొద్దని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీసులకు కాని, 1930 సైబర్ నేరాల హెల్ప్‌లైన్ కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

చిననింద్రకొలనులో కేంద్ర బృందం పర్యటన

ప్రజాశక్తి - నిడమర్రు

స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్‌లో భాగంగా మండలంలోని చిననింద్రకొలనులో శుక్రవారం కేంద్ర బృందం పర్యటించింది. ఈ సందర్భంగా గ్రామంలోని ఆలయాలు, స్కూల్స్, ప్రభుత్వ కార్యాలయాల్లో పారిశుధ్య పరిస్థితి, మురుగునీరు పారుదల, పచ్చదనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం కేంద్ర బృందం జిల్లా టీమ్ లీడర్ కె.శివకుమారి గ్రామంలో వ్యక్తిగత గృహాలను ర్యాండమ్‌గా పరిశీలించారు. చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద చేస్తున్న చెత్త విడదీయడం, ప్లాస్టిక్ గ్లాస్ తదితర వ్యర్థాలను వేరు చేయడం, వర్మీ తయారు చేయడం, తదితర అంశాలను పరిశీలించారు. జిల్లా కన్సల్టెంట్ వి.ప్రేమ్‌జిత్, డిపిఆర్‌సి కన్సల్టెంట్ ఎం.సురేష్‌కుమార్, ఎంపిడిఒ జి.విజయకుమారి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కె.రామారావు, డిప్యూటీ ఎంపిడిఒ స్వామి, కార్యదర్శి వెంకటరావు, ఎంఆర్‌సి కె.వెంకటేశ్వరరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్వచ్ఛాంధ్ర- స్వచ్ఛదివస్

కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

స్వచ్ఛాంధ్రప్రదేశ్ లక్ష్యంగా ప్రతి నెలా మూడో శనివారం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వచ్ఛాంధ్ర - స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 19వ తేదీన సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధం-పునర్వినియోగ వస్తువులను ప్రోత్సహించడం అనే థీమ్‌పై ప్రజలకు ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించనున్నట్లు కలెక్టర్ కె.వెట్రిసెల్వి తెలిపారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి స్వచ్ఛాంధ్ర స్వచ్ఛదివస్ కార్యక్రమం నిర్వహణపై అధికారులతో శుక్రవారం నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె.వెట్రిసెల్వి మాట్లాడుతూ మండల, నియోజకవర్గ ప్రత్యేక అధికారులంతా తమ పరిధిలోని ప్రాంతాల్లో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ముప్పును అరికట్టడానికి తయారీదారులు తగిన శ్రద్ధ వహించాలని పిలుపునిచ్చారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో కూడా ఈ డ్రైవ్ నిర్వహించాలన్నారు. ఏలూరు నగరంతో పాటు మున్సిపాలిటీల్లో, మండల పరిధిలో బై బ్యాక్ ప్లాస్టిక్ కేంద్రాలను ఏర్పాటు చేసి సింగిల్ యూస్ ప్లాస్టిక్ సేకరించాలన్నారు. ముఖ్యంగా రైతు బజార్లు, ఇతర వాణిజ్య దుకాణాల్లో సింగిల్ యూస్ ప్లాస్టిక్ నియంత్రణకు సంబంధిత ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు చేయాలన్నారు. ప్లాస్టిక్ ప్రత్యామ్నాయ వస్తువుల ప్రాముఖ్యతను తెలియపరచాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, డిఇఒ వెంకటక్ష్మమ్మ, తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు ఫాగింగ్ డ్రైవ్

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

జీలుగుమిల్లి పంచాయతీ పరిధిలో దోమల నివారణకు ఫాగింగ్ డ్రైవ్ పనులు చేపట్టినట్లు ఇన్‌ఛార్జి ఎంపిడిఒ నిఖిల్ మధు శరణ్ తెలిపారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో దోమల తీవ్రత పెరిగి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ముందస్తుగా దోమల నివారణకు ఫాగింగ్ డ్రైవ్ చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. జీలుగుమిల్లి పంచాయితీ పరిధిలోని పరిసర గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది అధ్వర్యంలో మొదటి విడత ఫాగింగ్ డ్రైవ్ పనులు చేపడుతున్నట్లు పంచాయతీ కార్యదర్శి పి.అశోక్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిర్రి జగదాంబ, అశోక్, సత్యనారాయణ, నాగేంద్ర, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతు శివాజీకి ఎంఎల్ఎ అభినందన

ప్రజాశక్తి - దెందులూరు

రైతుల ఆలోచన దృక్పథం ఎప్పుడూ కూడా వాణిజ్య పరంగా కన్నా, ఎదుటి వారి ఆకలి తీర్చడం మీదే ఎక్కువగా ఉంటుందని, రైతు వీరమాచినేని శివాజీ అందుకు నిదర్శనంగా నిలుస్తున్నారని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ తెలిపారు. దెందులూరు గ్రామంలోని స్థానిక మండల రెవెన్యూ అధికారి కార్యాలయం వద్దకు సమస్యల పరిష్కార నిమిత్తం వచ్చే చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చే ప్రజల ఆకలని తీర్చడం కోసం కేవలం పది రూపాయలకు వెజ్ బిర్యానీ అందిస్తున్న రైతు వీరమాచినేని శివాజీని ఎంఎల్ఎ ప్రత్యేకంగా అభినందించారు.